జిల్లా అంతా అముడా పరిధిలోకి తేవాలి

అమలాపురం– నవభూమి :జిల్లాలో నూతనంగా ఏర్పడిన అమలాపురం అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ(అముడా) కార్యకలాపాలను సమర్థవంతంగా పారదర్శకంగా నిర్వమించేందుకు కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, అముడా ఉపాధ్యక్షురాలు టి.నిషాంతి విజ్ఞప్తిచేశారు. సోమవారం అమలాపురంలోని నల్లవంతెన వద్ద గల అముడా కార్యాలయంలో చైర్మన్ అల్లాడ స్వామినాయుడు అధ్యక్షతన బోర్డు సభ్యులతో కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. అముడా కార్యకలాపాల తీరు, ప్రతిపాదనలపై పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా జేసీ నిషాంతి మాట్లాడుతూ అముడా పరిధిలో భవన నిర్మాణాలు, అనుమతులు, పంచాయతీల నుంచి ఆన్‌లైన్‌లో డెవలప్‌పెంట్ చార్జీలు వసూలుచేసే సాఫ్ట్‌వేర్ గురించి చర్చించారు. అముడా పరిధిలో మూడు నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయని, మిగిలినవి రుడా పరిధిలో ఉన్నందున జిల్లా అంతా యూనిట్‌గా చేసి అముడాలోకి తీసుకువస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లాలో ప్రభుత్వ భూములు ఉపయోగపడేవి ఉంటే అముడాకు అప్పగించాలని జిల్లా యంత్రాగాన్ని కోరుతూ బోర్డు తీర్మానించింది. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు మాట్లాడుతూ అథారిటీ అభివృద్ధికి సభ్యులంతా సలహాలివ్వాలని కోరారు. ట్రాన్స్‌కో ఎస్ఈ

ఎస్.రాజబాబు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకరరావు, ఆర్‌అండ్‌బీఎస్ఈ బి.రాము, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, ప్లానింగ్ అధికారి ఎ.సత్యమూర్తి పాల్గొన్నారు.

సీఎం పర్యటన తర్వాత తాడిపత్రికి కేతిరెడ్డి పెద్దారెడ్డి

వైసీపీ నేతలకు స్పష్టం చేసిన ఎస్పీ జగదీష్

అనంతపురం, మే 06 నవభూమి :రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 9వ తేదీన అనంతపురం జిల్లా పర్యటన ముగిశాక తాడిపత్రికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వెళ్లనున్నారు. ఈ విషయాన్ని ఎస్పీ జగదీష్ వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిలకు తెలియజేశారు. గత సార్వత్రిక ఎన్నికల తర్వాత చెలరేగిన ఘర్షణల నేపథ్యంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లకుండా నిలువరించారు. దీంతో పెద్దారెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో తాడిపత్రికి వెళ్లడానికి లైన్‌క్లియర్ అయ్యింది. ఐదు వాహనాలకు మించకుండా పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లేందుకు అనుమతిస్తూ ఈ మేరకు సెక్యూరిటీ ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం ఎస్పీ జగదీష్‌ను కలిసేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు ప్రయత్నించారు. అయితే ఉరవకొండ నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలనకు ఎస్పీ జగదీష్ వెళ్లడంతో వీలుకాలేదు. దీంతో మంగళవారం తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఎస్పీ కార్యాలయానికి వెళ్లి కోర్టు ఉత్తర్వు కాపీలను అడిషనల్ ఎస్పీకి అందజేశారు. ఇదే సమయంలో ఎస్పీ జగదీష్‌తో వారు మాట్లాడగా సీఎం చంద్రబాబు పర్యటన తర్వాత పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లే ఏర్పాట్లు చేస్తామని ఆయన చెప్పారు. అడిషనల్ ఎస్పీని కలిసిన తర్వాత అనంత, పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడారు. హైకోర్టు ఉత్తర్వులు అందజేసేందుకు తాము వచ్చినట్లు చెప్పారు. సీఎం పర్యటన ఏర్పాట్లలో బిజీగా ఉండడం వల్ల ఎస్పీని కలవలేకపోయామని, అయితే ముఖ్యమంత్రి పర్యటన ముగిశాక తగిన ఏర్పాట్లు చేస్తామని ఎస్పీ జగదీష్ చెప్పినట్లు వారు తెలియజేశారు. కోర్టు ఉత్తర్వులను అనుసరించి సెక్యూరిటీ ఇచ్చి పెద్దారెడ్డిని తాడిపత్రికి పంపాల్సిన బాధ్యత ఎస్పీపై ఉందని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు.

ఏలూరులో ఆంగ్ల ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

దెందులూరు మే 6 నవభూమి :ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ మరియు కొటక్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, (ముంబై) వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమం ఏలూరులోని అతిథి హోటల్ లో ప్రారంభమైంది. మే 5 నుండి 7వ తారీఖు వరకు మూడు రోజులు జరిగే ఈ కార్యక్రమానికి జోన్ –2 లోని ఆంగ్ల ఉపాధ్యాయులు హాజరవుతారు.మూడు సంవత్సరాలు కొనసాగే ఈ ప్రాజెక్ట్ లో నాయకత్వ లక్షణాలు, ఆంగ్ల భాష సామర్థ్యాలు, బోధనలో సాంకేతిక ను భాగం చేయడం వంటి అంశాలలో శిక్షణ పొందటంతో పాటుగా నిష్ణాతులైన ఉపాధ్యాయులను రిసోర్స్ పర్సన్స్ గా ఎంపిక చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న వట్లూరు కళాశాల ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీ రాణి తెలిపారు.ఈ కార్యక్రమంలో కొటక్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నుండి శ్రీ.ఫరీజ్, శ్రీ.నూతన్ శ్రీ. అమిత మరియు ఏలూరు జిల్లా డి.సి.ఓ శ్రీ. ఉమా కుమారి , దాసరి మేరీ ఝాన్సీ రాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

మంత్రి పార్థసారథి ఎంపీ మహేష్ యాదవ్ ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు మే 6 నవభూమి :"నిత్యం 450 మంది దెందులూరు నియోజకవర్గ విద్యార్థులు ప్రమాదకరమైన పరిస్థితుల్లో జాతీయ రహదారి దాటి వెళ్ళి చదువుకుంటున్నారు – వాళ్ల భద్రత కు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది. నేషనల్ హైవే అధికారులకు ఈ విషయం గతంలో సైతం చెప్పినా సరైన స్పందన రాలేదు. జాతీయ రహదారి నిర్మాణంలో అనేక చోట్ల సర్వీస్ రోడ్లు లేవు, ప్రమాదాల నివారణకు వెంటనే జాతీయ రహదారిపై ఉన్న సమస్యలను పరిష్కరించి చర్యలు చేపట్టాలి" : ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టర్ శ్రీమతి వేట్రీ సెల్వి, జిల్లా ఎస్పీ శ్రీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ వెల్లడి...

గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల

అభివృద్ధికి కృషి చేస్తా

◆ వ్యాయమ కళాశాల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తా:మంత్రి పార్థసారథి

దెందులూరు మే 6 నవభూమి :విభజన ఆంధ్ర ప్రదేశ్లో ఉన్న ఏకైక ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల అయిన శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల అభివృద్ధి సంక్షేమానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మరియు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం దెందులూరు మండలం గోపన్నపాలెం లోని శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్. జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఏలూరు శాసనసభ్యులు బడేటి చంటి లతో కలిసి గోపన్నపాలెం శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాల లోని బాలికల వసతి గృహం మరమ్మతులకు, బాలుర వసతి గృహం నిర్మాణ కొనసాగింపు ప్రహరీ గోడ నిర్మాణం భోజనం శాల రంగులు వేయడం లాంటి పనులకు రూ కోటి ఏడు లక్షల రూపాయల నిధులను శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయా విద్య కళాశాల ప్రిన్సిపాల్ నతానియల లతో కలిసి నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ తో కలిసి మంత్రి పార్థసారథి వ్యాయామ కళాశాలలో చదువుతున్న డి పి ఈ డి రెండో సంవత్సరం చదువుతున్న తులసిని వ్యాయామ కళాశాలలో పరిస్థితి ఏమిటి అని అడిగి తెలుసుకున్నారు కాలేజీలో రన్నింగ్ వాటర్ రావడం లేదని వర్షం వస్తే నీరు కాలేజీలోకి వస్తున్నాయని ఫ్లోరింగ్ కూడా పాడైందని శాసనసభ్యుల చింతమనేని ప్రభాకర్ తో పాటు మంత్రి పార్థసారథి కలెక్టర్ సెల్వి దృష్టికి విద్యార్థులు తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి ఎమ్మెల్యే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాల సమస్యలు తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారాన్ని కృషి చేస్తానని విద్యార్థులతో అన్నారు. ఈ కార్యక్రమంలో దెందులూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ మిల్లుబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గారపాటి రామసీత, ఏలూరు ఆర్డీవో తో పాటు పలువురు అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జిల్లా పర్యటన

ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి

◆ జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

అనంతపురం, మే 06 నవభూమి :రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన సందర్భంగా ఏర్పాట్లను త్వరితగతిన, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా పర్యటన నేపథ్యంలో ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్దనున్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను పరిశీలించడానికి వస్తున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై జిల్లాలోని ఆయా శాఖల జిల్లా అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.లిఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..గౌరవ ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ప్రాంతాలలో ఎక్కడా చెట్లను తొలగించరాదని, న్యాచురల్ గా ఉండాలని, అనవసరమైన ఖర్చులు చేయరాదని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. అనవసర బ్యారికెడ్ లను ఏర్పాటు చేయరాదని, అలాగే సభా ప్రాంగణంలో ఆ గ్రామానికి చెందినవారే ఉండే విధంగా చూడాలని, 14 నియోజకవర్గాల పరిధిలో ఒక్కొక్క నియోజకవర్గ నుండి 10 మంది ఆయకట్టు లబ్ధిదారులు, మొత్తం దాదాపు 3000 మంది మాత్రమే వచ్చేవిధంగా చూడాలని పిడి డిఆర్డిఏ అధికారులకు సూచించారు. హెలిప్యాడ్, కాన్వాయ్, సభా ప్రాంగణం, తదితర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని, కూబింగ్ ఆపరేషన్ త్వరితగతిన పూర్తిచేయాలని, అనుమానితులను గుర్తించాలని, అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్ చేయాలని, అలాగే అవసరం ఉన్నచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వీటిని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లను పూర్తి చేయాలని పోలీస్ శాఖ వారిని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన కాన్వాయ్ గుడ్ కండిషన్ వాహనాలను ఏర్పాటుచేసి వాటిని పరిశీలించి సర్టిఫై చేయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. గుంతకల్, కొనకొండ్ల మీదుగా ఉరవకొండ వచ్చే రోడ్డును ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా దారి మళ్లించడం (డైవర్ట్) చేయడం జరుగుతుందని, దానిని గుంతకల్ నుండి వజ్రకరూరు మీదుగా ఉరవకొండకు చేరుకునే విధంగా చూడాలని తెలిపారు. హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లకు సంబంధించి ఒక టీం వచ్చిందని, వారితో సమన్వయం చేసుకొని ఏర్పాట్లను పూర్తి చేయాలని, అలాగే ఒక తహసీల్దార్ ను లైజాన్ ఆఫీసర్ గా నియమించాలని అనంతపురం వారికి ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద బ్యారికేడ్ ను, టెంట్, టెంపరరీ టాయిలెట్స్ ను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని వాటిని పూర్తి చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద వాహనాలు పార్కు చేయుటకు ఆర్‌అండ్బి ఎస్ఈ మరియు పంచాయతీరాజ్ ఎస్ఈ ఏర్పాట్లు చేసుకోవాలని, హెలిప్యాడ్ వద్ద నిరంతరం విద్యుత్ సౌకర్యం ఉండే విధంగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, ఒక ఏఈ, లైన్మెన్ ను ఆర్‌అండ్బి ఎస్ఈ వారితో సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేయాలని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ వారికి ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ త్రాగునీరు, బయో స్టాయిలెట్స్ ను హెలిప్యాడ్ మరియు సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చూడాలని, మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని, డిస్టిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ వారు ప్రోటోకాల్ అరేంజ్మెంట్స్, బ్లాక్ కమాండోస్, స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్, తదితరులకు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఏర్పాట్లను చూసుకోవాలని, శానిటేషన్ పనులను సంబంధించి గుత్తి, గుంతకల్ మున్సిపల్ కమిషనర్లు మరియు డిపిఓ ఇంచార్జిగా ఉంటారని, గ్రీవెన్స్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, దీనికి సంబంధించి డిఆర్ఓ మరియు పిజిఆర్ఎస్ తహసీల్దార్ ఇన్చార్జిగా ఉంటారని, చాలామంది ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమానికి విచ్చేయడం జరుగుతుందని, వారికి సంబంధించి బస చేయడానికి గుంతకల్లులో ఏర్పాట్లను చేయాలని గుంతకల్లు మరియు గుత్తి తహసీల్దార్ లను ఆదేశించారు.అత్యవసర మందులను, అత్యవసర పరికరాలను, డాక్టర్లను, నర్సులను, అంబులెన్సులు, బ్లడ్ డోనర్స్ ను, మెడికల్ టీంలు, పారామెడికల్ స్టాఫ్, హెలిప్యాడ్ మరియు సభ ప్రాంగణం వద్ద క్యాంపులను, కాన్వాయ్ నందు మెడికల్ వాహనాన్ని, ఇతర చోట్ల 108 వాహనాన్ని ఏర్పాటు చేయాలని డిఎంహెచ్వో, డిసిహెచ్ఎస్, జిజిహెచ్ మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బందికి హెలిప్యాడ్, కాన్వాయ్, సభా ప్రాంగణం వద్ద తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ జూమ్ వీడియో కాన్ఫరెన్స్ లో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసి ఆసుపత్రి ఆధ్వర్యంలో

ఆసన్నగూడెంలో మెగా వైద్య శిబిరం

◆ గ్రామీణ స్థాయిలో కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్న ఎస్ఎంసి ఆసుపత్రిని అభినందిస్తున్న గ్రామీణులు

దెందులూరు మే 6 నవభూమి :ఆంధ్రప్రదేశ్ లో గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేటర్ స్థాయి వైద్యశాలలు అందిస్తున్న అతి ఖరీదైన వైద్యానికి దీటుగా ఎస్ఎంసి హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ ధాన్య రాజ్ ఎస్ఎంసి విద్యాసంస్థల అధినేత అవినాష్ రాజు చుక్కా ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం పై గ్రామీణ ప్రాంతంలో ఆమె సేవలను ఆసుపత్రి సిబ్బంది సేవలను ప్రజలు కొనియాడుతున్నారు. ఆసన్నగూడెంలో జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరంలో వివిధ ఆరోగ్య రుగ్మతలతో సతమతమవుతున్న రోగులకు ఉచిత సేవలు అందించి, ఉచితంగా మందులను సరఫరా చేశారు. ఈ వైద్య శిబిరానికి ఎస్ఎంసి విద్యా సంస్థల అధినేత లయన్ అవినాష్ రాజు చుక్కా, ఏలూరు విజన్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఆసన్నగూడెం పరిసర ప్రాంతాలకు చెందిన గ్రామీణులు 400 మందికి పైగా వైద్య సేవలు అందుకున్నారు. ఈ శిబిరానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ఎస్ఎంసి ఆసుపత్రి యాజమాన్యం నిస్వార్థంతో వైద్య సేవలను నిర్వహించి ఉచిత మందులను సరఫరా చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ సుమంత్ డయాబెటిక్ వైద్య సేవలు అందించారు. డాక్టర్ హరికిషన్ ఎముకులకు చెందిన రోగులను పరీక్షించి వారు తీసుకోవలసిన జాగ్రత్తలను వారి పాటించవలసిన నియమాలను వివరించారు. స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ గీతిక గర్భకోశానికి చెందిన సమస్యలను వారు తీసుకోవాలని జాగ్రత్తలను సూచించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ సందీప్ వృద్ధులకు, యువతీ యువకులకు కంటికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోళ్ళను, వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమం అంతా డాక్టర్ సంధ్యారాణి జనరల్ మెడిసిన్ ఎస్ఎంసి ఆసుపత్రి ఇన్చార్జి పర్యవేక్షణలో నిర్వహించడం గమనార్హం. గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి ఉచిత మెగా వైద్య విషయం శిబిరం నిర్వహించి ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు ఇవ్వడంతో ఎస్ఎంసి ఆసుపత్రి నిస్వార్థ సేవలకు గ్రామీణ ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడి కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోండి

గ్రామ టిడిపి అధ్యక్షుడు వేమన రాముగౌడ్ పార్టీ నాయకులు మోదుగుమూడి రాంబాబు

దెందులూరు మే 6 నవభూమి :అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వాన్నించే పాలు గుడ్డు పూర్తిస్థాయి భోజనాన్ని అర్హులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని చల్ల చింతలపూడి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేమన రాము గౌడ్ పార్టీ సీనియర్ నాయకులు మోదుగుమూడి రాంబాబు అన్నారు. మంగళవారం దెందులూరు మండలం చల్ల చింతలపూడి గ్రామంలోని అంగనవాడి సెంటర్లలో దెందులూరు సెక్టర్ సూపర్వైజర్ చిట్టెమ్మ అంగన్వాడి టీచర్ల ఆధ్వర్యంలో కిషోర వికాసం వేసవి శిక్షణా తరగతులను నిర్వహించారు ఈ సందర్భంగా కిషోర బాలికలకు శరీరంలో వచ్చే మార్పులు రుతుక్రమం మంచి ఆలోచన విధానం ఆన్లైన్ మోసాలు తదితరు విషయాలపై కిషోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు తో పాటు సిబ్బంది పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

దోసపాడులో అంగన్వాడి కేంద్రంలో వేసవి శిక్షణ తరగతులు

సెక్టర్ సూపర్వైజర్ శ్రీదేవి

దెందులూరు మే 6 నవభూమి :కిషోర్ బాలికలు చక్కగా వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని కొవ్వలి సెక్టర్ సూపర్వైజర్ శ్రీదేవి అన్నారు. దెందులూరు మండలం దోసపాడు గ్రామంలోని అంగనవాడి సెంటర్లలో దెందులూరు సెక్టర్ సూపర్వైజర్ శ్రీదేవి,టీచర్ల ఆధ్వర్యంలో కిషోర వికాసం వేసవి శిక్షణా తరగతులను నిర్వహించారు ఈ సందర్భంగా కిషోర బాలికలకు శరీరంలో వచ్చే మార్పులు రుతుక్రమం మంచి ఆలోచన విధానం ఆన్లైన్ మోసాలు తదితరు విషయాలపై కిషోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు తో పాటు సిబ్బంది పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొణికి కోల్డ్ స్టోరేజ్‌లపై ఫిర్యాదు..

తనిఖీలు చేపట్టిన అధికారులు

ఇంకొల్లు, మే 6 (నవభూమి) ఇంకొల్లు మండలం కొణికి వద్ద కొన్ని కోల్డ్ స్టోరేజ్‌లకు సరైన అనుమతులు లేవంటూ అద్దంకి నియోజకవర్గ జై భీమ్ రావు భారత్ పార్టీ సమన్వయకర్త హేబేలు బాపట్లలోని గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ వెంకట మురళికి ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన అధికారులు రంగంలోకి దిగారు. మంగళవారం అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ మరియు బుధవారం కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ (ఏఈఈ) భాస్కర్ వర్మ కొణికిలోని సదరు కోల్డ్ స్టోరేజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు ఫిర్యాదుదారుడైన హేబేలును కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోల్డ్ స్టోరేజ్‌ల నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, కాలుష్య నియంత్రణ చర్యలపై ఆరా తీశారు.పూర్తిస్థాయిలో సమగ్ర దర్యాప్తు నిర్వహించిన అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పెంపు

కాకినాడ-నవభూమి :రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టంచేశారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో సోమవారం సాయంత్రం మంత్రి నాదెండ్ల మనోహర్, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల ప్రజాప్రతినిధులు, రైస్‌మిల్లర్లు, జేసీలతో సమావేశమయ్యారు. ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో మూడు జిల్లాల్లో సీఎంఆర్ టార్గెట్‌ని అదనంగా పెంచా మని తెలిపారు. కాకినాడ జిల్లాకు 50 వేల ట న్నులు, కోనసీమ జిల్లాకు లక్ష టన్నులు, తూ ర్పుగోదావరి జిల్లాకు ఇప్పటికే పెంచిన 30 వేల టన్నులకు అదనంగా మరో 50 వేల టన్నులు పెంచామన్నారు. గత 9 నెలల్లో 49.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొను గోలు చేసి రూ.11,400 కోట్లు వారి ఖాతాల్లో జ మ చేశామన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం తేమ 22 శా తం వరకూ ఉన్నా కొనుగోళ్లు జరపాలని అధి కారులను ఆదేశించారు. కోనసీమలో మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీని 1:1 ఇవ్వడంపై మంత్రి అ టు జేసీ, ఇటు సివిల్ సప్లయిస్ అధికారుల వివరణ కోరారు. ఎమ్మెల్యేల సూచన, మిల్లర్ల కోరిక మేరకు బ్యాంకు గ్యారెంటీ 1:2 ఇవ్వాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలు మళ్లీ జరగకూడదు. ఎన్ని కల ముందు చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన హామీలు కచ్చితంగా అమలు చేయాలన్నారు.

ప్రజా సమస్యలే తొలి ప్రాధాన్యం :

20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, మే 6 (నవభూమి) ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని, అధికారులు సమస్యల పట్ల సత్వరమే స్పందించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారానికి అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార మార్గాలు అన్వేషించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు అధికారులు చొరవ చూపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని, సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించిన ఎమ్మెల్యే, సీసీ రోడ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని, సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రచించాలని అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించాలని సూచించారు.నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతోందని ఎమ్మెల్యే తెలిపారు. యువత అన్ని రంగాలలో మెలుకువలు, శిక్షణ పొందాలని సూచించారు. రానున్న రోజుల్లో 20 లక్షల మందికి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాజధాని అమరావతి నిర్మాణం వేగంగా జరుగుతుందని, అక్కడ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. యువత ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

శ్రీ అక్కమ్మ గార్ల జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి కుటుంబ సభ్యులు

అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

చిన్ననాటి నుంచి అమ్మవారిని కొలుస్తున్నామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంత పురం మే 06 నవభూమి :ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం కరుట్లపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీ అక్కమ్మ గార్ల జాతర మహోత్సవంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు. జాతర మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే దగ్గుపాటి కి గ్రామస్తులు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఉరుములు వాయిస్తూ అమ్మవారి ఆలయం వరకు వచ్చారు. అనంతరం అమ్మవారికి వెండి గొడుగులు సమర్పించి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆయన సతీమణి దగ్గుపాటి శ్రీలక్ష్మి, కుమార్తె దగ్గుపాటి అశ్రిత, కుమారుడు దగ్గుపాటి మణిహాస్ లు మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులందరిని ఎమ్మెల్యే ఎంతో ఆప్యాయంగా పలుకరించారు. చిన్ననాటి నుంచి అక్కమ్మ అమ్మవారిని కొలుస్తుంటామని ఇవాళ ఎమ్మెల్యే అయ్యాక జాతరలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి కృపా కటాక్షాలు ఈ ప్రాంతంపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరుట్లపల్లి మాజీ సర్పంచ్ బోయపాటి శ్రీనివాస్ నాయుడు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ సోమర జయచంద్ర నాయుడు, టిడిపి నాయకులు సింగమనేని రామాంజనేయులు, బోయపాటి అశోక్, సుందర్, బోయపాటి శ్రీధర్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కుటుంబసభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెలలో అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభం

కొరిశపాడు, మే 6 (నవభూమి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అన్నదాత సుఖీభవ కార్యక్రమం ఈ నెలలో మండలంలో ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటకృష్ణ మంగళవారం విలేకరులకు తెలిపారు.మండల పరిధిలోని వెబ్ ల్యాండ్‌లో ఇప్పటివరకు 1959 మంది రైతులు ఈ పథకం కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ డేటాను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పరిశీలన అనంతరం అర్హులైన రైతుల తుది జాబితాను త్వరలోనే ప్రకటిస్తామని ఏవో వెంకటకృష్ణ తెలిపారు.ఈ పథకం యొక్క ప్రయోజనాలను పొందాలనుకునే రైతులందరూ తమ ఆధార్ కార్డు మరియు పట్టాదారు పాసు పుస్తకాలతో వెంటనే సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఈ పథకం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

నెరవేరనున్న భక్తుల చిరకాల స్వప్నం

దెందులూరు మే 6 నవభూమి :అప్పన్నవీడులోనీ అభయాంజనేయ స్వామి ఆలయంలో భోజనశాల నిర్మాణంకు ఏలూరు ఎంపీ శ్రీ పుట్టా మహేష్ యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో నేడు శ్రీకారం"భోజన శాల నిర్మాణానికి ఎంపీ నిధులు రూ.35 లక్షలు కేటాయిస్తాం – త్వరితగతిన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపడతాం": ఏలూరు ఎంపీ శ్రీ పుట్టా మహేష్ కుమార్ గారు వెల్లడి.."అన్న క్యాంటీన్ సైతం ఏర్పాటు చేస్తాం – అదే విధంగా దెందులూరు నియోజకవర్గంలో ఎంపీ నిధులు కేటాయిస్తూ తొలి కార్యక్రమం అప్పన్న వీడు అభయాంజనేయ స్వామి వద్ద నుంచి ప్రారంభించటం ఎంతో సంతోషదాయకం – దెందులూరు నియోజక వర్గ అభివృద్ధికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ గారి సహకారం ఎంతో అభినందీయం" : దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ గారు వెల్లడి.దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ గారితో కలిసి అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న ఏలూరు ఎంపీ శ్రీ పుట్టా మహేష్ కుమార్ .ఏలూరు జిల్లా పెదపాడు మండలం అప్పన్న వీడు లోని ప్రముఖ ఆలయం శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఏలూరు ఎంపీ శ్రీ పుట్ట మహేష్ యాదవ్ దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్లు తెలిపారు. స్థానిక పెదపాడు మండల కూటమి నాయకులు మరియు భక్తుల విజ్ఞప్తి మేరకు అభయాంజనేయ స్వామి ఆలయంలో రూ. 35లక్షల రూపాయల ఎంపీ నిధులతో భోజనశాల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. అప్పన్నవీడులో కొలువైన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్థానిక కూటమి నాయకులతో కలిసి అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ పండితులు స్వామివారి ప్రసాదాలను ఎంపీ మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు అందజేశారు. అనంతరం ఆలయం సమీపంలో భోజనశాల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని ఎంపీ , ఎమ్మెల్యేలు సందర్శించారు. తన ఎంపీ నిధుల నుంచి రూ.35 లక్షలు భోజనశాల నిర్మాణానికి కేటాయిస్తున్నట్లు భక్తుల హర్షధ్వానాల నడుమ ఎంపీ పుట్టా మహేష్ ప్రకటించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి భోజన శాల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎంపీ మహేష్ కుమార్ స్పష్టం చేశారు. భోజనశాలకు సౌర శక్తితో విద్యుత్, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రారంభించి భారీ మెజారిటీతో ఘనవిజయం సాధించారని తెలిపారు. అలాగే దెందులూరు నియోజకవర్గంలో ఎంపీ నిధుల నుంచి తొలి అభివృద్ధి పనులను అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి ఎంపీ మహేష్ కుమార్ ప్రారంభిస్తున్నారని, దీనికి ఎంపీ మహేష్ కుమార్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. భోజనశాలతో పాటు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. అనంతరం భక్తులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెదవేగి మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లావేటి శ్రీనివాస్, నియోజకవర్గ సీనియర్ నాయకులు గారపాటి రామ సీత, తాత సత్యనారాయణ, సహా మండల పార్టీల అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), బొప్పన సుధా, నంబూరు నాగరాజు, మాజీ ఎంపీపీ మోరు శ్రావణి దశరథ్, క్లస్టర్ ఇంచార్జీ గుత్తా అనిల్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, సహా కూటమి నాయకులు కమ్మ శివరామకృష్ణ, మండల కార్యదర్శి మందపాటి వేంకటేశ్వర రావు, కొనకళ్ళ శివమణి గౌడ్, బొడ్డేటి మోహన్, జమలయ్య, గరికపాటి చంటి, ఏలూరు పార్లమెంటు తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు వడ్డీ వాసవి దేవి, ఆలయ కమిటీ నిర్వాహకులు వేమూరి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షులు బెక్కం లక్ష్మి నారాయణ, మాజీ ఎంపీటీసీ బెక్కం శ్రీనివాసరావు, మట్టా శ్రీనివాస్, సహా పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోపన్నపాలెం ఎస్ఎస్ఆర్. ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలను పరిశీలించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారది

◆ బాలికల హాస్టల్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి

దెందులూరు, మే, 6 నవభూమి :దెందులూరు మండలం గోపన్నపాలెంలోని శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, కలెక్టర్ కె. వెట్రి సెల్వి మంగళవారం పరిశీలించారు. కళాశాలకు విచ్చేసిన వారికి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నతానియేలు, దెందులూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్, కళాశాల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి సంబంధించి అధికారులు ప్రజాప్రతినిధులు చర్చించారు. రాష్ట్రంలోనే ఏకైక వ్యాయామ విద్య కళాశాల గోపన్నపాలెం లో ఉందని దీని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కోరారు. ప్రిన్సిపల్ నతానియేలు కళాశాలలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిని మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీ, అధికారులకు వివరించారు. ఫీజులు తక్కువగా ఉండటం వల్ల రాష్ట్రం నలుమూలల నుంచి ఎస్సీ, ఎస్టీ ,బీసీ విద్యార్థులు ఈ కళాశాలలో చేరతారన్నారు. వీరికి ప్రత్యేకంగా హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు. గతంలో కారుకోట డిగ్రీ కళాశాలకు ఇదేవిధంగా సౌకర్యం కల్పించడం వల్ల ఎక్కువ మందికి ప్రయోజనం కలిగిందని గుర్తు చేశారు. ఇందుకు సంబంధించి మంత్రి కొలుసు పార్థసారథి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రితో చరవాణిలో మాట్లాడారు. అనంతరం బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. వసతి గృహంలో నెలకొన్న సమస్యలను బాలికలు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ బాలికల వసతి గృహానికి సంబంధించి కోటి రూపాయలు నిధులు ఎంపీ నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. టాయిలెట్స్, తాగునీరు ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, తహశీల్దార్ బి. సుమతి, యంపిడివో శ్రీదేవి, దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామ సీత, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ సిహెచ్. మహేష్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లావేటి శ్రీనివాసరావు, భారతీయ జనతా పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్, డి ఎస్ డి ఓ శ్రీనివాసరావు, కూటమి నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వర్షాల వేళ ప్రజలంతా

అత్యంత అప్రమత్తంగా ఉండాలి

◆ జిల్లాలో పలు చోట్ల పిడుగులు పడే అవకాశం ◆ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేప్పుడు చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ ఉండరాదు ◆ సురక్షితమైన భవనాల్లో ప్రతి ఒక్కరూ ఆశ్రయం పొందాలి ◆ జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.

అనంతపురం బ్యూరో మే 06 : నవ భూమి :వర్షాల వేళ ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సూచించారు. ఏపీ విపత్తుల సంస్థ సూచనల మేరకు జిల్లాలో పలు చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేప్పుడు చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ ఉండరాదన్నారు. సురక్షితమైన భవనాల్లో ప్రతి ఒక్కరూ ఆశ్రయం పొందాలని, వర్షాల వేళ అందరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఉరుములు, పిడుగుపాటు సమయంలో పాటించవలసిన జాగ్రత్తలు :చేయవలసినవి..:వాతావరణ సూచనలను గమనించి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు బయట పనులు, కార్యక్రమాలు వీలైనంత వరకు ఆపుకోవలెను.పొలాల్లో పనిచేసే రైతులు. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు, పశుకాపరులు, గొర్రెల కాపరులు, సురక్షితమైన భవనాలలోకి వెళ్ళాలి.బహిరంగ ప్రదేశాలలో ఉన్నట్లయితే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. లేకుంటే రబ్బరు చెప్పులను ధరించి చెవులను మూసుకొని మోకాలిపై కూర్చోవాలి– ఇంట్లో ఉన్నట్లయితే కిటికీలు, తలుపులు మూసివేయాలి. ఉరుముల శబ్దం ఆగిపోయిన తర్వాత కూడా 30 నిమిషాల వరకు ఇంట్లోనే ఉండి రక్షణ పొందండి.– పిడుగు భాదితుడిని సత్వరమే దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తరలించవలెను. చేయకూడనివి :– ఉరుములు, మెరుపులు సంభవించినప్పుడు చెట్ల క్రింద, చెట్ల సమీపంలో, టవర్లు, చెరువుల దగ్గర ఉండరాదు.బహిరంగ ప్రదేశాలలో ఉన్న షెడ్లు, ఇంటి పైన ఇతర చిన్న నిర్మాణాలలో ఉండరాదు.ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర పరికరాలు, చార్జ్ ఫోన్లు/మొబైల్స్ వినియోగించరాదు.పిడుగుల సమయంలో స్నానం చేయడం, చేతులను కడగటం, నీటిలో ఉండటం లాంటివి చేయరాదు– మోటరు సైకిళ్ళు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, ట్రాన్స్ ఫార్మర్స్ కు వ్రేలాడుతున్న విద్యుత్ తీగలకు మరియు ఇతర ఇనుప వస్తువులకు దూరంగా ఉండాలి.

డీఈఓ శామ్యూల్ పాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆంజనయ్య

ఎమ్మిగనూరు మే 6 (నవభూమి):ఆదోనిలో సెయింట్ జోసఫ్ పాఠశాలలో ఆదోని డివిజన్ లో ఉన్న ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాధికారుల సమావేశంలో కర్నూలు జిల్లా విద్య అధికారి డిఇఓ శామ్యూల్ పాల్, ని నేషనల్ హ్యూమన్ రైట్స్ పరిరక్షణ కమిషన్ కర్నూలు జిల్లా చైర్మన్ తలారి.అంజినయ్య మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు మండల విద్యాధికారి ఆంజనేయులు, మర్యాదపూర్వకంగా కలిశారు.ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు తాలుక ఇంచార్జి గిడ్డయ్య మాదిగ,ముగతి ప్రతాప్ కుమార్,రాజు తదితరులు పాల్గొనడం జరిగింది.

ప్రజాదర్బార్"లో ప్రజా సమస్యలపై వినతి పత్రాల స్వీకరణ

సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు

రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్

అనంతపురం, మే 06 : నవభూమి :అనంతపురం నగరంలోని రాంనగర్ లో ఉన్న రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ నిర్వహించారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో వివిధ రకాల ప్రజా సమస్యలపై ప్రజల నుంచి వినతి పత్రాలను మంత్రి స్వీకరించారు.లిఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాంటివని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు, నాయకులు, ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించి, ఎలాంటి ఆలస్యం కాకుండా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రతి కుటుంబం విజయం సాధించే అవకాశం ఉన్నప్పుడే నిజమైన శ్రేయస్సు

మునిసిపల్ కమీషనర్ జి.రఘునాథ రెడ్డి

బాపట్ల – నవభూమి : ప్రతి కుటుంబం విజయం సాధించే అవకాశం ఉన్నప్పుడే నిజమైన శ్రేయస్సు సాధించబడుతుందనే నమ్మకంపై ఆధారపడి ఉంటుందని మునిసిపల్ కమీషనర్ జి.రఘునాథ రెడ్డి తెలిపారు.ముఖ్యమంత్రి,జిల్లా కలెక్టర్,ఆదేశముల మేరకు జీరో పావర్టీ–పి4 పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ ఇనిషియేటివ్ ద్వారా,సంపన్న పౌరులు ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాలకు సామాజిక,ఆర్థిక సంపూర్ణ సహాయం అందించటంలో తన వంతు బాధ్యతగా ఆయన మద్దతు ఇవ్వడానికి మార్గదర్శిగా ముందుకు వచ్చారన్నారు.అందులో భాగంగా బాపట్ల పురపాలక సంఘ పరిధిలో ఇప్పటికీ 5 ఎస్టి బంగారు కుటుంబాలను దత్తతు తీసుకోగా మూడవ వార్డు రాజీవ్ గాంధీ కాలనీలో ఆయన ఒక బంగారు కుటుంబమైనటువంటి మొదగండి సంధ్య వారి యొక్క గృహాన్ని స్వయంగా సందర్శించారు.వారి యొక్క కుటుంబ ఆర్థిక స్థితిగతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.వారి యొక్క కుటుంభ వివరముల గురించి అడుగగా ముగ్గురు సంతానమని తెలిపారు.ఆ ముగ్గురు పిల్లలతో కమీషనర్ కొంతసేపు ముచ్చటించారు.పిల్లలు యొక్క విద్య యందు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.వారి కుటుంబ ఎదుగుదల సమిష్టి వృద్ధి ప్రయాణానికి వారికి కొన్ని సూచనలు చేశారు.పట్టణ ప్రజలను ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ బాపట్ల పురపాలక సంఘములో 13,336 కుటుంబాలను సర్వే చేయగా ప్రభుత్వం వారు 2,359 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేసియున్నార న్నారు.ఆసక్తి ఉన్న పట్టణ పౌరులు పెద్ద మనసుతో ఈ పి4 ద్వారా 2,359 కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా వారి యొక్క బంగారు శ్రేయస్సుకు దోహదపడే భవిష్యత్తును సాకారం చేసుకోవడానికి వారికి సహకరించాలని,ఆంధ్ర రాష్ట్రం నందు సున్నా పేదరికాన్ని సాధించవచ్చున్నారు.

కలెక్టరేట్‌లో 200 అర్జీల స్వీకరణ

అమలాపురం-నవభూమి : అర్జీల పరిష్కారంలో ఫిర్యాదుదారుల సంతృప్తే లక్ష్యంగా జవాబుదారీతనంతో వాటికి పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో రాజకుమారి, డ్వామా, డీఆర్డీఏ పీడీలు మధుసూదన్, జైచంద్రగాంధీ, ఎస్టీసీ కృష్ణమూర్తి, డీఎల్డీవో రాజేశ్వరరావు తదితరులు ఫిర్యాదుదారుల నుంచి 200 ఆర్జీలను స్వీకరించారు. ప్రతీ అర్జీ స్థాయి అంచనా వేసి ఫిర్యాదును విశ్లేషించి న్యాయపరంగా పరిష్కారం చూపినప్పుడే ఈ తరహా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గడువు దాటిన అర్జీలు లేకుండా, ఒకే ఫిర్యాదు మళ్లీమళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వర పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు. జేసీ నిషాంతి మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా అర్జీల స్థాయిని బట్టి పెండింగ్‌లో లేకుండా పరిష్కారం చూపాలన్నారు. అనర్హత ఉంటే తగిన కారణాలను అర్జీదారులకు వివరించాల్సిందిగా జేసీ సూచించారు.

జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. కాగా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి 24 మంది అర్జీదారులు తమ సమస్యలపై వినతులను అందించారు.

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సైదాను సన్మానించిన రఫీ అహ్మద్

ఒంగోలు, మే 6 (నవభూమి) :జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సైదా మంగళవారం ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కర్స్ అధ్యక్షులు రఫీ అహ్మద్ నివాసానికి మర్యాదపూర్వకంగా వెళ్లారు. ఈ సందర్భంగా రఫీ అహ్మద్,షేక్ సైదాను శాలువాతో ఘనంగా సన్మానించారు. ముస్లింల మీద జరుగుతున్న దాడులు, ముస్లింల సంక్షేమానికి తీసుకోవలసిన చర్యలపై కొంతసేపు చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ రసూల్, సంతనూతలపాడు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పాలపర్తి విజేష్ రాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుధీర్ వర్మ, ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ మొహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భరోసా: కొనుగోలు చేస్తాం ఆందోళన వద్దు

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, మే 6 (నవభూమి) :బర్లి పొగాకు రైతులు ధైర్యంగా ఉండాలని, వారి పంటను తప్పకుండా కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భరోసా ఇచ్చారు. నష్టానికి అమ్ముకోవద్దని ఆయన రైతులకు సూచించారు. పొగాకు కంపెనీలు పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ, రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి కృషితో ప్రభుత్వం నేరుగా రైతుల వద్దకు వచ్చిందని ఆయన కొనియాడారు. వ్యవసాయ కమిషనర్ ఢిల్లీ రావు మాట్లాడుతూ, రైతు ప్రయోజనాలే ముఖ్యమని, ఒక పద్ధతి ప్రకారం కొనుగోలు చేస్తామని, లేదంటే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. సమస్య పరిష్కారమయ్యే వరకు కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.

అద్దంకిలో కమల్ కిషోర్ జన్మదిన వేడుకలు

అద్దంకి, మే 6 (నవభూమి) విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోదరుడు, దివంగత నేత కిషోర్ కుమారుడు కమల్ కిషోర్ పుట్టినరోజు వేడుకలు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, చాగంటి శివప్రసాద్, యర్రాకుల రామాంజనేయులు, నర్రా శివకృష్ణతో పాటు పలువురు టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేడు దెందులూరులో సైఫన్ ఆవిష్కరించరున్న ఎంపీ, ఎమ్మెల్యే

దెందులూరు. మే 6 నవభూమి:నియోజకవర్గ టీడీపీ, జనసేన , బీజేపీ నాయకులకు కార్యకర్తలు అభిమానులకు నమస్కారం రేపు అనగా 07-05-2025 బుధవారం ఉదయం 9:00 గంటలకు దెందులూరు గ్రామం అలుగు లగూడెం వెళ్లే దారిలో సైఫన్ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేయుచున్న మన ప్రియతమ నాయకులు దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ ఏలూరు పార్లమెంట్ సభ్యులు శ్రీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ విచ్చేయుచున్నారు.కావున మన నియోజకవర్గ డివిజనల్ స్థాయి అధికారులు దెందులూరు మండల అధికారులు , దెందులూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు మండల పార్టీ అధ్యక్షులు క్లస్టర్ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు, బూత్ కమిటీ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కాబోయే బ్యాంకు అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు , జడ్పీటీసీలు, సర్పంచ్ లు ఎంపీటీసీలు ప్రస్తుత సర్పంచులు నీటి సంఘం అధ్యక్షులు, ఎంపీటీసీలు, తెలుగుదేశం పార్టీ అన్నీ అనుబంధ విభాగాల నాయకులు కార్యకర్తలు అభిమానులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరుచునలిదెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ కార్యాలయం దుగ్గిరాల కోరారు

బ్లైండ్ స్పాట్ దర్శకునికి అభినందనలు తెలియజేసిన ఆనం



మర్రిపాడు, నవభూమి :బ్లైండ్ స్పాట్ సినిమాతో దర్శకుడుగా పరిచయం కాబోతున్న చుంచులూరు రాజుపాలెం గ్రామానికి చెందిన ఆనం కుటుంబ ఆత్మీయుడయిన యల్లంరాజు మోహన్ రాజు కుమారుడు రాకేష్ వర్మ కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి అభినందనలు తెలియజేస్తూ,ఈ సినిమా విజయవంతం కావాలని రాకేష్ వర్మ గొప్ప దర్శకుడుగా రాణించాలని ఆకాంక్షించారు..

రైతు సేవా కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు

అమలాపురం. మే6.(నవభూమి ప్రతినిధి) :అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా గతంలో ఇచ్చిన రెండు లక్షల మెట్రిక్ టన్నుల టార్గెట్ కు అదనంగా మరో లక్ష మెట్రిక్ టన్నులు ధాన్యం రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతిని మంజూరు చేసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి వెల్ల డించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం నందు నిర్వహించిన పాత్రికే యుల సమావేశంలో ఆమె మాట్లా డుతూ ప్రస్తుత రబి సీజన్లో ఆశించిన ఉత్పత్తులలో 34 శాతం మేర అనగా రెండు లక్షల మెట్రిక్ టన్నుల మాత్ర మే టార్గెట్ ను ప్రభుత్వం నిర్దేశించారని ఈనెల ఐదో తేదీన కాకినాడ లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహణ తీరు సమీక్షలో రాష్ట్ర పౌరస రఫరాల మంత్రి వర్యులు నాదెండ్ల మనోహర్ జిల్లా యంత్రాంగం మరియు మిల్లర్లు టార్గెట్ పెంచాలన్న అభ్యర్థన మేరకు అదనంగా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఆమో దించారన్నారు.ఈ టార్గెట్ లో 40 వేల మెట్రిక్ టన్నులు బాయిల్ రైసు,60 వేల మెట్రిక్ టన్నులు రా రైస్ సేకరించాలని లక్ష్యంగా నిర్దే శించారన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఒక లక్ష, 2 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి 24 గంటల లోపు ధాన్యం సొమ్ములు రైతు ఖాతాకు జమ చేయడం జరిగింద న్నారు. మిల్లర్లకు బ్యాంకు గ్యారం టీలను కూడా 1:2 గా తగ్గించిందన్నారు. ఉదా హరణకు ఒక కోటి రూపాయ లు బ్యాంకు గ్యారంటీ ఇస్తే రెండు కోట్ల మేర ప్రభుత్వ పరంగా మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు ఇటీవల కురిసిన అకాల వర్షాలు దృష్టి లో పెట్టుకుని రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రభు త్వం దృష్టి సారించిం దని రైతులు కూడా వాతావర ణ హెచ్చరికలకు అనుగు ణంగా జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షాలకు తడిసి పోయి ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా రైతు సంక్షేమమే పరమా వధిగా ప్రభుత్వం పనిచే స్తుంద న్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఏవైనా ఇబ్బం దులు సమస్యలు సందేహాలు ఉన్నట్లయితే జిల్లాస్థాయిలో ఉన్న కమాండ కంట్రోల్ రూమ్ లో సంప్రదించి నివృత్తి చేసుకొని పరిష్కార మార్గాలు పొందా లన్నారు ధాన్యం కొనుగోలుకు సంబంధించి తేమ శాతం 17 గా ఉంటే కనీస గిట్టుబాటు ధరను చెల్లిస్తారని, 18 శాతం ఉంటే ఒక కేజీ, 19 శాతం ఉంటే 2 కేజీలు , 20% ఉంటే 3 కేజీలు, 21% ఉంటే 4 కేజీలు, 22 శాతం ఉంటే 5 కేజీలు, 22% కన్నా

జాయింట్ కలెక్టర్ టి నిశాంతి

తేమ శాతం ఎక్కువ ఉన్న ఐదు కేజీలు మాత్రమే తరుగులను విధించాలని మిల్లర్లను ఆదేశించామన్నా రు. బొండాలు రకానికి బహిరంగ మార్కెట్లో డిమాండ్ ఉందన్నారు రైతు సేవా కేంద్రాల గ్రామ వ్యవ సాయ సహాయకులు ద్వారా ధాన్యం పండించిన రైతులకు అన్ని విధాల సహాయ సహ కారాలు అందించడం జరుగుతోందన్నారు.గతంలో దీపం - 1 పథకం కింద ప్రభుత్వం ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేదని ప్రస్తుతం దీపం-2 క్రింద నాలుగు మాసాలకు ఒక సిలిండర్ను ఉచితంగా అందిస్తోందని ఈ విధంగా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి అందించడం జరుగుతుంద న్నారు ప్రజా ప్రతినిధులు జిల్లా స్థాయి అధికారులు తమ పర్య టనలలో ఉచిత సిలిండర్ల పంపిణీ కార్యక్ర మాలను నిర్వహించడం జరుగు తో%శీ%దన్నారు దీపం 2 కింద ప్రస్తుతం రెండవ దశ కొనసాగుతుందని రెండో సిలిండర్ పొందేందుకు ఆన్లైన్లో బుక్ చేసుకోవాలని సూచిం చారు రాష్ట్ర ప్రభుత్వం ఆసు పత్రి సేవలు, పి జి ఆర్ ఎస్ అర్జీలు పరిష్కార నాణ్య త ఉచిత సిలిండర్ల పంపిణీ వంటి సంక్షేమ పథకాల సంతృప్తి స్థాయిలను ఐ వి ఆర్ ఎస్ పోర్టల్ ద్వారా లబ్ధిదారుల నుండి ప్రభుత్వం కోరుతోందని ఆ దిశగా సంతృ ప్తి స్థాయిలను మెరుగుప రుస్తూ జిల్లాను సంక్షేమ పథ కాల అమలులో ముందంజ లో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ ఉదయ భాస్కర్, పౌరసర ఫరాల జిల్లా మేనేజర్ కుమారి ఎం బాల సరస్వతి, అసిస్టెంట్ మేనేజర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సర్వజనాసుపత్రిని

1200 పడకలకు విస్తరిస్తాం

◆ సర్వజనాసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నాం◆ ఆర్ఓ ప్లాంట్ పారంభోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి◆ సప్తగిరి క్యాంపర్ సేవా కార్యక్రమాలను అభినందించిన ఎమ్మెల్యే

◆ స్వచ్ఛంద సంస్థల సహకారం చాలా అవసరమన్న ఎమ్మెల్యే

అనంతపురం మే 06 నవభూమి:అనంతపురం సర్వజనాసుపత్రిని 1200 పడకల ఆసుపత్రిగా త్వరలో విస్తరిస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరంలోని జేఎన్టీయూ రోడ్ లో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సప్తగిరి క్యాంపర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్లతో పాటు వైద్యాధికారులు, సప్తగిరి క్యాంపర్ ప్రతినిధులు మరియు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు. ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ సప్తగిరి క్యాంపర్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఇప్పటికే సర్వజనాసుపత్రితో పాటు సిడి హాస్పిటల్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలలో 25 లక్షలతో ఆర్.ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయడం రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వీల్ చైర్లు, ఫ్యాన్లు, కూలర్లు తదితర వాటిని అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పేదలకు వైద్య సేవలు అందించే ఆసుపత్రులలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం వలన ఎంతో మందికి ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి వాటిని కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మరోవైపు అనంతపురం సర్వజనాసుపత్రిలో అవసరమైన భవనాల నిర్మాణానికి 38 కోట్ల తో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా వైద్య ఆరోగ్యశాఖ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివరించారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపర్డెంట్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున రెడ్డి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోనంకి గంగారామ్, రవికాంత్ రమణ, రత్నమయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, సప్తగిరి క్యాంపర్ ప్రతినిధి హనీఫ్, ఆలంబన జనార్ధన్, కార్పొరేటర్ బాలాంజనేయులు, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి సరిపూటి రమణ, మాజీ కార్పొరేటర్ రాజారావు, దత్తాత్రేయ ఆలయ కమిటీ చైర్మన్, టిడిపి నాయకుడు రాయల్ మధు, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీ నరసింహ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార పార్టీ ఫిరోజ్ అహ్మద్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్, తెలుగుయువత నగర అధ్యక్షుడు బొమ్మినేని శివ, బెస్త సాధికార సమితి రాష్ట్ర నాయకుడు చేపల హరి, బిసి సెల్ నాయకుడు జోగి రాజేంద్ర, తెలుగుదేశం పార్టీ నాయకులు నెట్టెం బాలకృష్ణ, బండి కాశీ విశ్వనాథ్, సికిందర్, మణికంఠ బాబు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో

ముస్లింలకు ఎలాంటి ఆందోళనవసరం లేదు

◆ ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లింల పక్షాన ఉన్నారు...ఎమ్మెల్యే దగ్గుపాటి◆ స్మశాన వాటికల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తాం

అనంత పురం మే 06 నవ భూమి : వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో ముస్లింలకు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముస్లింలకు ఎలాంటి ఇబ్బంది రానివ్వరని ఆయన అన్నారు. అశోక్ నగర్ లో ఉన్న ముస్లింల స్మశాన వాటిక ఖబరస్తాన్ ప్రహరీ గోడ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షకీల్ షఫీ, మేయర్ వసీం, కమిషనర్ బాలస్వామి లతో పాటు ఇతర మైనార్టీ విభాగం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలు వక్ఫ్ సవరణ బిల్లు తర్వాత ఆందోళనలో ఉన్నారని అయితే ఏపీలో వారి హక్కులకు వారి ఆస్తులు విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లింల పక్షాన నిలుస్తారన్నారు. అర్బన్ నియోజకవర్గంలో గత ఐదేళ్లలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదని అశోక్ నగర్ లోని కబరస్తాన్ పరిస్థితి అద్వాన్నంగా ఉన్నా.. ఇటువైపు చూడలేదన్నారు. ఇక్కడ ప్రహరీ గోడ లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని షకిల్ షఫీ తన దృష్టికి తీసుకురాగానే 80 లక్షల రూపాయలు నిధులు తీసుకొచ్చామన్నారు. 67 లక్షలతో ప్రహరీ గోడ, 13 లక్షలతో లైటింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే హిందూ స్మశాన వాటికలో కూడా 45 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. ఇక్కడ అంత్యక్రియల సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరోవైపు అనంతపురం నగరంలో అక్టోబర్ 2 నాటికి డంపింగ్ యార్డ్‌లో చెత్త కనిపించకుండా చేస్తామన్నారు. 750 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఇప్పటికే ప్రతిపాదన పంపినట్లు వివరించారు. 80 కోట్లతో నడిమి వంక, మరువ వంక ప్రొటెక్షన్ వాల్ నిర్మాణ పనులు త్వరలోనే జరుగుతాయన్నారు. అర్బన్ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగితే ఎలా ఉంటుందో ఇప్పుడు చూపిస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌస్ మోద్దిన్, కార్పొరేటర్లు బాలాంజనేయులు, జనబలం బాబా, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు పరమేశ్వర్, కొండన్న, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, మాజీ కార్పొరేటర్ రాజారావు, టిడిపి మైనార్టీ నాయకులు తాజుద్దీన్, పూల భాష, కట్టుబడి బాబాజీ, ఆటో హబ్ దాదు, నూర్, మున్సిపల్ అధికారులు, మైనార్టీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండల న్యాయ సేవ అధికార సంస్థ అవగాహన సదస్సు

బాపట్ల-నవభూమి :బాపట్ల మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల ఏపీఎస్ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో జరిగిన న్యాయ అవగాహన సదస్సులో బాపట్ల మండల న్యాయ సేవ అధికార సంస్థ ప్యానల్ లాయర్ దగ్గుమల్లి కిరణ్ కుమార్ చట్టాలపై మాట్లాలాడారు.ఆర్టీసీ గ్యారేజ్ కార్మికులకు చట్టాల గురించి కార్మికులకు సంక్షేమ కోసం,వారికి సమానత్వం,కార్మికులకు తగిన ప్రాముఖ్యత,ఉద్యోగ భద్రత,వారి పిల్లలకు విద్య,కార్మిక కుటుంబాలకు జీవిత భీమా,ఆరోగ్య భద్రత,భద్రతాపరమైన అంశాలు అవగాహన కల్పిస్తూ కార్మికులను చైతన్య వంతులను కావాలన్నారు.ఈ కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ,ఆధునిక ప్రపంచంలో చట్టాల గురించి తెలుసుకొని చట్టాలలోని అంశాలను అవలంబించడం ద్వారా మెరుగైన సమాజంలోకి ఈ సమాజాన్ని తీసుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల మండల న్యాయ సేవ అధికార సంస్థ పార లీగల్ వారింటర్లు ప్రసాద్,శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో యువతను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు

బాపట్ల పార్లమెంట్ టి.యన్.యస్.యఫ్ అధ్యక్షులు మొవ్వ శరత్‌చంద్ర

బాపట్ల-నవభూమి :స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు రద్దు చేయడం,ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడం,కొత్త పరిశ్రమలు రాకపోవడం,ఉన్నవి తరలిపోవడం,నిరుద్యోగ భృతి రద్దు వంటి జగన్ ప్రభుత్వ చర్యలతో యువత రోడ్డునపడ్డారని బాపట్ల పార్లమెంట్ టి.యన్.యస్.యఫ్ అధ్యక్షులు మొవ్వ శరత్‌చంద్ర అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువత సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి పెట్టి 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు.గడిచిన 11 నెలల్లో 16,347 పోస్టులతో మెగా డీయస్సీ,6,100 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ,రూ.8.5 లక్షల కోట్ల పెట్టుబడులతో 5 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.గంజాయి,డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపడం కోసం ఆపరేషన్ ఈగిల్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింద అని సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలతోగానీ,స్నేహితులు చెప్పే మాటలతో గానీ ఎవరూ బెట్టింగ్ యాప్‌లు,లోన్ యాప్‌ల జోలికి వెళ్లవద్దు అన్నారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని యువత భవిష్యత్‌ను బంగారమయం చేసుకోవాలని పిలుపునిచ్చారు.మీ తల్లిదండ్రులు ఆశయ సాధన కోసం,వారి ఆనందం కోసం ఉన్నత లక్ష్యాల వైపు యువత పయనించాలని టీఎన్ఎస్ఎఫ్ తరఫున పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లిమెంట్ సెక్రటరీ పరిస గోపి,తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉడత దేవేందర్ బాలాజీ,కర్రి సుధీర్ తదితర యువత నాయకులు పాల్గొన్నారు.

అధికారులు,ఉద్యోగులు సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కరించాలి : ఎమ్మెల్యే

కొత్తపేట మే6 నవభూమి :అధికారులు,ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.కొత్తపేటలోని బండారు బులిసత్యం చంద్రావతి కాపు కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో అన్ని శాఖల అధికారులు,ఉద్యోగులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్,ఆకుల రామకృష్ణ, అయినవిల్లి సత్తిబాబు గౌడ్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అందుకు తగ్గట్టుగా అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు.ఈ సమావేశంలో పలు గ్రామాలలోని సమస్యలను పలువురు నాయకులు అధికారుల దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యే కలుగజేసుకుని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామం,పేరవరం తదితర గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.రెవెన్యూ సమస్యలను సమావేశంలో లేవనెత్తడంలో పరిష్కార మార్గాలు చూసి పరిష్కరించాలని నాలుగు మండలాల తహశీల్దారు లను ఎమ్మెల్యే ఆదేశించారు.వేసవి కాలం దృశ్యా త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.అన్ని శాఖలలోనూ పని తీరు మెరుగు చేసుకోవాలని అధికారులకు,ఉద్యోగులను,సిబ్బందికి ఎమ్మెల్యే సత్యానందరావు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రామచంద్రపురం-నవభూమి : ద్రాక్షారామలో రూ.11.5 కోట్లతో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పా ర్కు ఏర్పాటుచేస్తున్నట్టు మంత్రి సుభాష్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పా టుకు ఊతమిస్తూ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ద్రాక్షారామ సమీపంలో ఆదివారపుపేట గురుకుల పాఠశాల వద్ద ఈ పార్కు నిర్మాణం చేపడతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఇండ స్ట్రియల్ పార్కులను ప్రభుత్వం ఏర్పాటుచేస్తోందని, ఇందులో భాగంగా 2027-28 నాటికి 15వేల ఎంఎస్ఎంఈలు ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వీటి ద్వారా 2 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవ కాశాలు లభిస్తాయన్నారు. నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇండస్ట్రియల్ పార్కులకు రూపకల్పన చేసిందన్నారు. మేడే సందర్భంగా సీఎం చంద్రబాబు పది నియోజకవర్గాల్లో 30 ఎంఎస్ ఎంఈలకు శంకుస్థాపన చేశారని తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఏర్పాటుచేసే పారిశ్రామిక పార్కులో ఉపాధి కల్పనలో భాగంగా నియోజకవర్గంలో భర్తను కోల్పోయిన 40 ఏళ్లలోపు మహిళలు 160 మందిని గుర్తించామని, వారికి తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఇండస్ట్రియల్ పార్కుల్లో ప్లగ్ అండ్ ప్లే విధానంలో మౌలిక సదుపాయాలు కల్పించి పరిశ్రమలు స్థాపించుకునేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పరిశ్రమ పెట్టాలనుకునేవారు ముందుకువస్తే బ్యాంకు రుణాలు మం జూరు చేసేలా వారికి సహకరిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రతీ ఇంటికి ఒక పారిశ్రామికవేత్త ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలు తయారు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళు తున్నామన్నారు. ఎంఎస్ఎంఈల పార్కుల నిర్మాణంతో వేలాది మంది ఉపాధి పొందుతారని చెప్పారు.

దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలి

బహుజన సమాజ్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ గుదే రాజారావు

బాపట్ల-నవభూమి : దళితులు క్రిస్టియన్ మతంలోకి మారిన మరుక్షణం ఎస్సీ హోదా కోల్పోతుందని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు దురదృష్టకరమని బహుజన సమాజ్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ గుదే రాజారావు అన్నారు.ఏ మతంలోకి మారినా దళితులు అంటరానితనానికి వివక్షతకు గురవుతూనే ఉన్నారన్నారు.క్రిస్టియానిటీ కులాన్ని గుర్తించకపోయినా కులవివక్ష కొనసాగుతున్నదని అనేక నివేదికలు వెల్లడిరచాయన్నారు.మన దేశంలో కులం మతంపై ఆధారపడిలేదు అని వ్యవస్థీకృతమై ఉందని కులం పునాదుల్ని తొలగించడానికి అవసరమైన రాజకీయ,ఆర్థిక, సామాజిక చర్యల్ని తీసుకోవాలన్నారు.దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలని బహుజన సమాజ్ పార్టీ కోరారు.అందుకు అవసరమైన చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బహుజన సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.రాష్ట్రంలో మతం కులంపై ఆధారపడి దళితులపై వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ,ఎస్టీ నిరోధక చట్టం కింద ఫిర్యాదు చేయలేరని,ఒకవేళ ఆ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినా,అది చెల్లదని హైకోర్టు తేల్చి చెప్పిందని మతం మారిన మాత్రాన కులం మారిందా కులానికి మతానికి ముడి పెట్టొద్దని,ఎస్సీ,ఎస్టీ అత్యాచార చట్టం నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.రానున్న కాలంలో దళిత క్రైస్తవులపై దాడులు వేధింపులు, ఆర్థికంగా అణచడానికి ఈ సూచనలని బహుజన్ సమాజ్ పార్టీ తెలియజేస్తుందని ఇకన్నైనా ప్రభుత్వాలు స్పందించి దళిత క్రైస్తవుల్ని ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు.

అల్లంపాడులో సభ్యత్వ కార్డులు పంపిణీ జోరు

5 లక్షలు బీమా టీడీపీ కుటుంబానికి సభ్యత్వ కార్డులు పెద్ద వరం

అల్లంపాడు సర్పంచ్ వీరారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు గూడాల శ్రీనివాసులు, షేక్ ఖాజా హుస్సేన్, ఇమకాశమ్

మర్రిపాడు (నవభూమి) : అలంపాడు గ్రామంలో రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి సూచనల మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు అరికట్ల జనార్ధన్ నాయుడు, మాజీ అధ్యక్షులు శాఖమూరి నారాయణ ఆధ్వర్యంలో పసుపు సైనికులకు టీడీపీ సభ్యత్వ కార్డులను అల్లంపాడు సర్పంచ్ వీరారెడ్డి, గుడాల శ్రీనివాసులు, ఖాజా హుస్సేన్, ఇమకాశమ్ సమక్షంలో అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100రూపాయలు చెల్లించి టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి పార్టీ సంక్షేమ విభాగం ద్వారా కార్యకర్తకు 5లక్షల రూపాయలు ప్రమాదభీమా సౌకర్యం వస్తుంది.అలాగే కార్యకర్తల కుటుంబాలలోని విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం,కార్యకర్తలు లేదా వారి కుటుంబ సభ్యులఉపాధికి సహకారం అందిస్తుందన్నారు.పార్టీ ఎంప్లాయిమెంట్ విభాగం ద్వారా నైపుణ్య శిక్షణ మరియు ఉద్యోగాలు, కార్యకర్తలు లేదా వారి కుటుంబ సభ్యులు అనారోగ్యం పాలైతే చికిత్సకు ఆర్థిక సహాయం అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ ద్వారా నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల - నవభూమి : పిజిఆర్ఎస్ ద్వారా నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం సమర్థంగా పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.ప్రజల సమస్యలన్నీ పరిష్కరించడానికి ప్రతి సోమవారం పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.సమాజంలో నిరాదరణకు గురయ్యే గిరిజన,దివ్యాంగుల కొరకు ప్రతి నెలలో నాలుగో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.జిల్లా స్థాయిలో జరిగే గ్రీవెన్స్‌లో ప్రజలు నేరుగా కలెక్టర్‌ని కలిసి ఫిర్యాదులు చేయవచ్చన్నారు.వినతి పత్రాల ద్వారా వారి సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకురావచ్చన్నారు.మండల స్థాయిలో తహసిల్దార్లు,ఎంపీడీవోలకు ఫిర్యాదులు చేయవచ్చన్నారు.ప్రజలు తమ సమస్యలపై నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేయడానికి కాల్ సెంటర్ నెంబర్ 1100ను ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఈ నెంబర్‌కి కాల్ చేసి వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు.ప్రజలు చేసే ప్రతి ఫిర్యాదును తక్షణమే రిజిస్ట్రేషన్ చేసి,రసీదు అందజేస్తారనన్నారు. ఫిర్యాదు దారుడి సమస్య పరిష్కారం అవ్వగానే మీ సమస్య పరిష్కారం అయ్యిందంటూ తెలుగులోనే ఫిర్యాదుదారుడికి ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు.మనమిత్ర పేరుతో వాట్సాప్ గవర్నెన్స్ ను ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని కలెక్టర్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వాట్సాప్ గవర్నెన్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు.ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు.వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సుమారు 200 ప్రభుత్వ సేవలను ప్రజలకు అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.ప్రజలు తమ మొబైల్ నెంబర్ నుండి వాట్సాప్ నెంబర్ 91 9552300009కు హాయ్ అని పంపి సేవలను పొందవచ్చని ఆయన వివరించారు.

పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్

బకాయిలను విడుదల చేయాలి

◆ రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం ◆ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్

బాపట్ల -నవభూమి : రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి ఇచ్చినటువంటి హామీలో భాగంగా పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు, వైసీపీ ప్రభుత్వం పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత చదువులకు దూరం చేసే పద్ధతులలో జీవో నెంబర్ 77 తీసుకువచ్చి కేవలం ప్రభుత్వ విద్యాసంస్థలు చదివే వారికి మాత్రమే ఫీజు రీయింబర్స్మెంట్ పథకం వర్తింపజేస్తుందని ప్రైవేట్ విద్యాసంస్థల్లో పీజీ చేసే విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ వర్తించదని జీవో నెంబర్ 77 తీసుకోవడం జరిగిందన్నారు, తక్షణమే జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులతో కిటకిటలాడుతున్న యూనివర్సిటీలలో రాష్ట్రవ్యాప్తంగా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తీసుకోవడం వల్ల యూనివర్సిటీలో విద్యార్థులు లేనటువంటి దౌర్భాగ్యమైనటువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో నెలకొంది అన్నారు, రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలో బాగుపరచాలంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కామన్ ఎంట్రెన్స్ ప్రవేశ పరీక్షను రద్దుచేసి ఏ యూనివర్సిటీకి సంబంధించిన ప్రవేశ పరీక్ష హ యూనివర్సిటీ నిర్వహించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న సందర్భంలో వైద్య విద్యను పేదలకు దూరం చేసే విధంగా జీవో నెంబర్ 107 108 తీసుకువచ్చి వైద్య విద్యను కోట్ల రూపాయలకు అమ్ముతుండడంతో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ జీవోలను రద్దు చేస్తూ ప్రతి పేద విద్యార్థికి వైద్య విద్యను అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారని గుర్తుకు చేశారు, తక్షణమే పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే జీవో నెంబర్ 107 108 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ వసతి దివన బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్న తూతూ మంత్రంగా 788 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి చేతులు దులుపుకుందన్నారు,, మాకు కావాల్సింది 788 కోట్లు కాదు 3580 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.. రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు దోపిడీ చేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలను వేలాది రూపాయలకు అమ్ముకుంటూ వ్యాపారం చేస్తున్నా కూడా కూటమి ప్రభుత్వం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని పేర్కొన్నారు,రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకరం చుడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు డి.దిలీప్, తోకల విజయ్, సోమినేని సందీప్, మామిడిబత్తుల గణేష్ కతదితరులు పాల్గొన్నారు.

కులాలకు మతాలకు అతీతంగా

సేవలందిస్తున్న సంస్థ ఆర్‌డిటి

◆ త్రిబుల్ ఇంజన్ సర్కార్ స్పందించి ఆర్డిటి సంస్థకు నిధులు ఇవ్వాలి ◆ ఎఫ్ సిఆర్ ఏను పునరుద్ధరించాలి

◆ ఆర్డిటి లేకపోతే ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తారు ◆ అనంతపురం మాజీ పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య

అనంతపురం బ్యూరో మే 06 నవభూమి : ఆర్డీటి సంస్థ ఎఫ్ సి ఆర్ ఎ రెన్యువల్ ను కేంద్ర ప్రభుత్వం నిలుపుదల చేయడం సరైన పద్ధతి కాదని కళ్యాణదుర్గం వైకాపా సమన్వయకర్త తలారి రంగయ్య ఖండించారు.ఈమేరకు ఆయన మంగళవారం కళ్యాణదుర్గం తన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కరువు కాటకాలతో నిత్యం తల్లడిల్లుతున్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో 50 సంవత్సరాల పాటు గ్రామీణ ప్రాంతాలలో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థ అయిన ఆర్డీటీ పై కూటమి ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శించడం సరైన పద్ధతి కాదన్నారు. అనంత జిల్లాలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు విద్యా ,వైద్యం తో పాటు అనేక సేవా కార్యక్రమాలను అందిస్తున్న ఆర్డిటీ సంస్థకు ప్రజలంతా అండగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు. ఎఫ్ సి ఆర్ ఏ నిధులను నిలుపుదల చేయడంతో అనేక మంది పేద ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వంలో భాగ్యస్వాములుగా ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎందుకు ప్రధాని మోడీ దృష్టికి తీసుకు పోలేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆర్డిటీ సంస్థకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ మద్దతుగా నిలిచిందన్నారు. ఆర్డిటీ సంస్థ ఎఫ్ సి ఆర్ ఎ రెన్యువల్ ను పునరుద్ధరించకపోతే గ్రామీణ స్థాయి నుంచి ఢిల్లీ వరకు పోరాటాలు చేపడతామని రంగయ్య అన్నారు. ఆర్డిటి సమస్త అనంతపురం జిల్లాలో 63 మండలాల్లో ప్రజలకు గృహ నిర్మాణాలు చేపట్టడంతో పాటు గ్రామాల్లో ఎన్నో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫారిన్ కంట్రీస్ నిధులను నిలిపివేయడం వల్ల ఆర్డిటి సంస్థ మూతపడే అవకాశం ఉందన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి విదేశాల నుంచి వచ్చే నిధులకు కేంద్ర ప్రభుత్వం అడ్డు కట్ట వేయడం సమంజసం కాదన్నారు. ప్రతి గ్రామంలోనూ ఆర్డిటి సమస్త పాఠశాలలు నిర్మించిందని ఎంతోమంది విద్యార్థులకు చదువు చెప్పించి వారిని ఉన్నత స్థానాలకు తీసుకెళ్లింది అన్నారు. అలాగే గ్రామాల్లో రైతులకు బోర్డు వేయించడం జరిగింది అన్నారు. వికలాంగులకు, చెవిటి మూగ కలిగిన విద్యార్థులకు ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటుచేసి వారికి నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. పదవ తరగతిలో ఫస్ట్ క్లాస్ మార్కులు వచ్చిన విద్యార్థులకు పరీక్ష నిర్వహించి ఆ ఎంట్రెన్సో మంచి మార్కులు వ చ్చినవారికి ఉచితంగా ఇంటర్మీడియట్ చదివిస్తున్నారన్నారు. అనంతపూర్ జిల్లాలోని లక్ష మంది నిరుపేదలకు గృహ నిర్మాణాలు నిర్మించి ప్రజలకు ఇవ్వడం జరిగిందన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఆర్డిటి సంస్థ పెద్దపీట వేసిందన్నారు. స్పెయిన్ దేశానికి చెందిన విన్సెంట్ ఫెర్రర్ 1969లో అనంతపురం జిల్లాకు విచ్చేసి కరువుతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఆర్డిటి సంస్థను ఏర్పాటుచేసి పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా కళ్యాణ్ దుర్గం రాయదుర్గం ప్రాంతాల్లో ఆర్డిటి సమస్త పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందించడంతోపాటు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగింది అన్నారు. కళ్యాణ్ దుర్గం, కనేకల్లు, బత్తలపల్లి ప్రాంతాల్లో ఆస్పత్రిలో ఏర్పాటుచేసి రోజుకు వేల మందికి వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. కరోనా సమయంలో లక్షల మంది కరోనా రోగులకు వైద్యం అందించి ప్రాణాలను కాపాడిన సంస్థ ఆర్ డి టి అని పేర్కొన్నారు.త్రిబుల్ ఇంజన్ సర్కార్ రాష్ట్రంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెంటనే చొరవ తీసుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తో మాట్లాడి ఆర్డిటి సంస్థకు విదేశాల నుంచి వచ్చే నిధులను రెన్యువల్ చేసి త్వరిత గతిన అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 13వ తేదీ నుంచి కంటిన్యూగా నిరసనలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. వారం రోజుల లోపల ఆర్డిటి సంస్థకు నిధులు ఇవ్వాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సినిమా డైరెక్టర్‌గా ఆరంగేట్రం చేసిన రాజుపాలెం కుర్రోడు

మర్రిపాడు (నవభూమి.) : చుంచులూరు రాజుపాలెం గ్రామానికి చెందిన యల్లంరాజు మోహన్ రాజు,ఉమారాణి దంపతుల కుమారుడు రాకేష్ వర్మ నవీన్ చంద్ర,రాశి సింగ్ హీరో,హీరోయిన్ లుగా,రవి వర్మ,గాయత్రి భార్గవి ప్రధాన పాత్రధారులుగా,రామకృష్ణ వీరపనేని నిర్మాణ సారధ్యంలో బ్లైండ్ స్పాట్ సినిమాతో రచయిత మరియు దర్శకునిగా ఆరంగేట్రం చేశారు.ఈ సినిమా ఈ నెల తొమ్మిదవ తేదీన విడుదల కానుంది.ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన రాకేష్ వర్మ సినిమా డైరెక్షన్ పై మక్కువతో హైదరాబాదు లోని ప్రముఖ దర్శకుడు ఉమామహేశ్వరరావు సారధ్యంలోని దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో డైరెక్టర్ గా శిక్షణ పొందాడు.అనంతరం పలు షార్ట్ ఫిలింలకు దర్శకత్వం వహించారు.వాటిలో పానీపూరి అనే షార్ట్ ఫిలిం కు జాతీయస్థాయి అవార్డు రావడంతో యూ.వీ క్రియేషన్ వారు అతని ప్రతిభను గుర్తించి బ్లైండ్ స్పాట్ సినిమాకు దర్శకుడుగా అవకాశం కల్పించారు.రాకేష్ వర్మ దర్శకత్వంలో తొలి చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో రాజుపాలెం,చుంచులూరు,పడమటి నాయుడు పల్లి తదితర గ్రామాల ప్రజలు అభినందనలు తెలియజేస్తూ,ఈ సినిమా విజయం సాధించాలనీ,రాబోయే రోజుల్లో రాకేష్ వర్మ గొప్ప దర్శకుడు రాణించాలని కోరుకుంటున్నారు.

శక్తి యాప్‌పై విస్తృతంగా అవగాహన

బాపట్ల-నవభూమి : మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్ ఆవశ్యకత,వినియోగం,దానిలో నిక్షిప్తం చేయబడిన పలు అంశాల గురించి జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లాలోని శక్తి బృందాలు మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పించారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బాపట్ల,చీరాల,రేపల్లె శక్తి బృందాలు జిల్లాలోని కోచింగ్ సెంటర్స్,ఫ్యాక్టరీలు,మాల్స్,బస్టాండ్లు,రైల్వే స్టేషన్‌లు,ఇతర కార్యాలయాలు,జన సమూహం ఉండే ఇతర ప్రదేశాలతోపాటు జిల్లాలోని పలు ముఖ్యమైన ప్రాంతాలను సందర్శించారు.మహిళలకు శక్తి యాప్ ను ఏ విధంగా వారి మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలి,వినియోగించు విధానం,యాప్‌లో పొందుపరచబడి ఉన్న విస్తృతమైన సమాచారం గురించి వివరించారు.అంతేకాకుండా గుడ్ టచ్-బ్యాడ్ టచ్,బాల్య వివాహాల నిషేధ చట్టం,సైబర్ నేరాలు,ఫోక్సో చట్టం,వివిధ హెల్ప్ లైన్ నెంబర్లు వాటిని వినియోగించుకునే సందర్భం తదితర విషయాల గురించి అవగాహన కల్పించారు.

సాల్ట్ భూములను పరిశీలించి మార్కెట్ ధరలను నిర్ణయించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల నవభూమి : సాల్ట్ భూములను పరిశీలించి,వాటికి మార్కెట్ ధరలను నిర్ణయించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.సాల్ట్ భూముల పరిశీలన,ధరల నిర్ధరణపై అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన సమావేశం నిర్వహించారు.సాల్ట్ భూములు ఉన్న ప్రాంతాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు.ఇందు కొరకు జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.జిల్లా పరిధిలోని చిన్నగంజాం మండలంలో 2,486 ఎకరాల భూములు సాల్ట్ కమిషన్ అధీనంలో ఉన్నాయన్నారు.ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆ భూములను సర్వే చేయాలన్నారు.ఆ భూమి ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు.జిల్లా స్థాయి కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు.తదుపరి ఆ ప్రాంతంలో మార్కెట్ ధరలు,సాల్ట్ భూముల విలువను నిర్ధరణ చేస్తూ ధరలపై నివేదిక సమర్పించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్,జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారి,చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఒప్పందాని.. కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి

◆ లేనిపక్షంలో వైసిపి న్యాయపోరాటం చేస్తుంది ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి

నెల్లూరు,మే 6,(నవభూమి):: విద్యుత్ ఒప్పందాని కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించు కోవాలని.. లేని పక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ న్యాయపోరాటం చేస్తుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గం ఇంచార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు.నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్,ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాత్రికేయ సమావేశం నిర్వహించి మాట్లాడారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నప్పటికీ.. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.అధికారం చేపట్టిన నాటి నుంచి 11నెలల్లో వరుస స్కామ్ లతో.. టిడిపి నేతలు దోచుకోవడం మొదలెట్టారని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయమని.. వైసిపి నేతలు ప్రశ్నిస్తుంటే.. కేసుల పేరుతో వైసిపి నాయకుల నోరు నొక్కేస్తున్నారని అన్నారు.కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ల్యాండ్, ఇసుక,లిక్కర్,సిలికాలను టిడిపి నేతలు అడ్డగోలుగా దోచుకుంటూ.. వేల కోట్ల రూపాయల అక్రమార్జనే ధ్యేయంగా చెలరేగిపోతున్నారని మండిపడ్డారు.ముఖ్యంగా కూటమి ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో 11 వేల కోట్ల అక్రమాలకు తెరలేపిందన్నారు.మే 2వ తేది ఏపీ విద్యుత్ శాఖ అధికారులు యాక్సిస్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందమే ఈ అవినీతికి భీజమన్నారు.ఇది భారతదేశంలో అతి పెద్ద స్కాం అన్నారు.గత వైసిపి ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ సెఖీ వద్ద యూనిట్ విద్యుత్ ను 2.49 పైసలకు వైసీపీ ప్రభుత్వం కొనుగోలు చేస్తే దాన్ని లక్ష కోట్ల కుంభకోణమని టిడిపి నేతలు నిందలు వేశారు.నేడు టిడిపి ప్రభుత్వం యాక్సిస్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని యూనిట్ విద్యుత్తును 4.60 పైసలకు కొనుగోలు చేసి.. పేద ప్రజలపై 11 వేల కోట్ల అదనపు భారం వేసిందన్నారు. ప్రభుత్వంలోకి రాకముందు చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని.. అవసరమైతే తగ్గిస్తామని చెప్పి.. నేడు ప్రజల మీదే భారం మోపుతున్నారని అన్నారు.కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పేదలపై విద్యుత్ సర్ చార్జీల పేరుతో ఇప్పటికే 15 వేల కోట్ల రూపాయలు వసులు చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో 5000 రూపాయలు విద్యుత్ బిల్లు వచ్చే వారికి 8000 రూపాయల బిల్లు వస్తుందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం 4.60 రూపాయలకు విద్యుత్ కొనుగోలు చేసి 25 సంవత్సరాలకు ఒప్పందం చేస్తుందని,దీంతో రాబోయే రోజుల్లో విద్యుత్ ఛార్జీలు ఇంకా పెరిగే అవకాశం